క్లుప్తంగా

తగ్గుతున్న టమాట ధరలు

కడప అగ్రికల్చర్‌: టమాట ధరలు తగ్గుతున్నాయి. మొన్న మొన్నటి వరకు కిలో రూ. 40 నుంచి రూ.50 ఉన్న ధర ప్రస్తుతం రూ. 25కు చేరింది. దీంతో వినియోగదారులు ఊరట చెందుతున్నారు. మిరపధర కూడా కాసింత ఘాటు తగ్గి కిలో రూ. 40 చేరింది. సామాన్యులకు అత్యవసరమైన మిరప, టమాట ధర తగ్గడంపై పేద, మధ్య తరగతికి చెందిన వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వీటితోపాటు బెండకాయ కిలో రూ. 20, వంకాయ, బీరకాయలు కిలో రూ. 35 ఉండటంతో కాసింత ఊరట చెందుతున్నారు.

చెత్త తొలగింపు



గౌస్‌నగర్‌లో చెత్తను తరలిస్తున్న పారిశుధ్య కార్మికులు

కడప రూరల్‌ : కడప నగరం గౌస్‌నగర్‌లోని సమస్యలపై 'పారిశుద్ధ్య లోపం.. ప్రజలకు శాపం' అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఈ కథనంపై సంబంధిత అధికారులు తక్షణం రంగంలోకి దిగారు. డంపు యార్డులో ఉన్న చెత్త దిబ్బలను ట్రాక్టర్ల ద్వారా పారిశుద్ధ కార్మికులు తరలించారు. అలాగే ఇతర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

కర్నూలు ఆర్‌ఐఓ పై విచారణ జరిపించాలి

కడప ఎడ్యుకేషన్‌: కర్నూలు జిల్లా ఇంటర్‌ ఆర్‌ఐఓ పై సమగ్ర విచారణ జరపాలని ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్‌ డిమాండ్‌ చేశారు. ఈ విషయమై మంగళవారం కడపలోని ఇంటర్‌ ఆర్‌జేడీ కార్యాలయంలో ఆర్‌జేడీ రవిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్‌ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్‌ పబ్లిక్‌ పరీక్షలలో అనేక రూపాల్లో దొంగ బిల్లులు పెట్టి ప్రభుత్వం నుంచి లక్షలాది రూపాయలు దోచుకున్న కర్నూలు జిల్లా ఆర్‌ఐఓ గురవయ్యశెట్టి పై విచారణ జరపాలన్నారు.

కాలేజీల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



ప్రభుత్వ జూనియర్‌ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్‌ చేశారు. మంగళవారం కడపలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల వద్ద విద్యార్థులతో కలసి ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఇంటర్‌ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం మళ్లీ మధ్యాహ్న భోజనం అమలు చేసేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా నాయకులు మణికంఠ, నాయక్‌, హేమంత్‌ సురేంద్ర, అశోక్‌ పాల్గొన్నారు.

రామరాజు పల్లెలో కుక్కల పట్టివేత



కుక్కను పట్టుకుంటున్న నగరపాలక సిబ్బంది

కడప కార్పొరేషన్‌: కడప నగరంలోని రామరాజుపల్లెలో వీధి కుక్కలను నగరపాలక సిబ్బంది మత్తు మందు ఇచ్చి పట్టుకున్నారు. సోమవారం రామరాజు పల్లెలో కుక్కలు ముగ్గురు చిన్నారులను గాయపర్చిన నేపథ్యంలో విషయం తెలుసుకున్న కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్‌ చేసి నగరంలో కుక్కల బెడద లేకుండా చూడాలని ఆదేశించారు. దీంతో నగరపాలక సిబ్బంది బృందాలుగా ఏర్పడి మంగళవారం ఉదయం 12 కుక్కలకు మత్తు మందు ఇచ్చి వ్యానులో తీసుకుపోయారు. మూడు రోజుల పాటు ఇదే ప్రాంతంలో ఉండి కుక్కల బెడద లేకుండా చేస్తామని వారు తెలిపారు.

అలవెన్సులకు మోక్షం

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : పెండింగ్‌లో ఉన్న నైట్‌ అలవెన్సులను ఈనెల నుంచి అరియర్స్‌ బిల్లులో చేసుకోవాలని డీపీటీఓ గోపాల్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని కార్మిక పరిషత్‌ జోనల్‌ కార్యదర్శి పురుషోత్తం తెలిపారు. ఆదివారం కడపకు విచ్చేసిన రవాణాశాఖ మంత్రిని కలిసి ఈ విషయంగా చర్చించామని, మంత్రి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారన్నారు. స్పందించిన డీపీటీఓ నైట్‌అవుట్‌ అలవెన్సు సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని ఎస్‌టీఓకు ఆదేశించారన్నారు.

వైవీయూలో కళకళలు

- నృత్య, సంగీత కోర్సుల్లో ప్రవేశాలు
- 8 నుంచి 22 వరకు ప్రవేశాలు



కళల కాణాచిగా నిలుస్తున్న వైఎస్‌ఆర్‌ కడప జిల్లాలోని యోగివేమన విశ్వవిద్యాలయంలో కళారంగాల్లో ఆసక్తి ఉన్న వారి కోసం నృత్యం, సంగీత విభాగాల్లో సర్టిఫికెట్‌ కోర్సులు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కూచిపూడి నృత్యం, కర్నాటక సంగీతం, కీబోర్డు సర్టిఫికెట్‌ కోర్సులను ప్రారంభించింది. దీనికి సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో 2010లో లలితకళల శాఖ ఏర్పాటైంది. బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫైన్‌ఆర్ట్స్‌ రెగ్యులర్‌ కోర్సుగా ఉండగా, థియేటర్‌ ఆర్ట్స్‌, పెయింటింగ్‌లు సర్టిఫికెట్‌ కోర్సులుగా ఆదరణ పొందుతున్నాయి. వీటికి అనుబంధంగా సంగీతం, నృత్యం విభాగాల్లో సర్టిఫికెట్‌ కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో నృత్యం, సంగీతం వంటి కోర్సుల్లో డిప్లొమా, సర్టిఫికెట్‌ కోర్సులు చేయాలంటే హైదరాబాద్‌ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. తిరుపతిలోని పద్మావతి విశ్వవిద్యాలయంలో కోర్సులు ఉన్నప్పటికీ అవి కేవలం మహిళలకే కేటాయించడంతో శిక్షణ పొందాలనుకునే వారికి అవకాశాలు దక్కేవి కావు. చాలామంది ఔత్సాహికులు ప్రైవేట్‌గా నృత్యం, సంగీతం శిక్షకుల వద్ద నేర్చుకుంటున్నప్పటికీ వారు గుర్తింపు పొందిన విద్యాలయం నుంచి సర్టిఫికెట్‌, డిప్లొమా సర్టిఫికెట్‌లు పొందాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. వివిధ రకాల వర్గాల నుంచి వచ్చిన అభ్యర్థనలను పరిగణలోకి తీసుకున్న వైవీయూ అధికారులు రాయలసీమలోనే తొలిసారిగా అన్ని వర్గాల వారు సర్టిఫికెట్‌, డిప్లొమా కోర్సులు సాయంత్రం కోర్సులుగా చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

- 2022–23లో ఈ కోర్సులను ప్రారంభించగా, రెండు బ్యాచ్‌లు పూర్తికాగా దాదాపు 300 మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు సాధించడం విశేషం. కోర్సులు పూర్తి చేసుకున్నవారు స్వయం ఉపాధితో పాటు వివిధ సంస్థల్లో శిక్షకులుగా పని చేస్తుండటం విశేషం. ప్రస్తుతం చదువుకుంటున్నవారు, ఉద్యోగాలు చేస్తున్నవారు, ప్రైవేట్‌గా శిక్షణ పొందుతున్న కళాకారులు ఇలా ఏ రంగానికి చెందినవారైనా, 10 సంవత్సరాలు నిండినవారెవరైనా కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు.
- యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ అందిస్తారు. కోర్సుకు సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆసక్తి ఉన్న వారు ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే ప్రవేశాల ప్రక్రియకు నేరుగా హాజరై ప్రవేశాలు పొందవచ్చు. పూర్తి వివరాలకు డబ్లుడబ్లుడబ్లు.వైవీయూ.ఈడీయూ.ఇన్‌ వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు. 9032595101 నెంబర్‌లో సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చు.

ఆదరణ బాగుంది..



యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న సంగీత, నృత్య సర్టిఫికెట్‌ కోర్సులకు ఆదరణ బాగుంది. పిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా అందరూ కలిసి సాధన చేస్తారు. ఇది మంచి అనుభవం. నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ అందిస్తున్నాం. విశ్వవిద్యాలయ అధికారుల ప్రోత్సాహంతో కడపను కళల కేంద్రంగా మారుస్తాం.

– డాక్టర్‌ కోట మృత్యుంజయరావు, లలితకళల విభాగాధిపతి, వైవీయూ

కోర్సు పూర్తి చేశాను..



కూచిపూడి నృత్యం నేర్చుకోవడంతో పాటు సర్టిఫికెట్‌ కోర్సును పూర్తి చేయడం సంతోషంగా ఉంది. కూచిపూడి నేర్చుకోవడం ద్వారా శారీరకంగా, మానసికంగా చురుగ్గా ఉండవచ్చు. కూచిపూడిలో ఉన్నతవిద్యను అభ్యసించాలని అనుకుంటున్నా. – ఎ. యశశ్రీ, కూచిపూడి విద్యార్థిని, కడప



వైవీయూ ప్రథమ బ్యాచ్‌ కూచిపూడి విద్యార్థులు (ఫైల్‌)

కరుణించు తల్లీ.. విజయదుర్గమ్మ

కడప శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలను నిర్వహించారు. శ్రావణమాసం ప్రారంభం అయిన నేపథ్యంలో శుభదాయకంగా భావించి రాహుకాల పూజల కోసం మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. – కడప కల్చరల్‌



పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన శాస్త్రవేత్త మానస

కడప అగ్రికల్చర్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతిని సాధించాలని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్‌ వీరయ్య పేర్కొన్నారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రెండవ రోజు స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాస్త్రవేత్త డా.యస్‌. మానస వ్యవసాయంలో సౌర శక్తి ఆవశ్యకత, దాని వినియోగం, ఉపయోగాలు గురించి వివరించారు. దక్షిణ ప్రాంత వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్ష సంస్థ గార్లదిన్నె, అనంతపురం వారి సహకారంతో మహిళా రైతులకు అనుకూలమైన వ్యవసాయ పనిముట్లు , పరికరాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం వాటిని ఎలా ఉపయోగించాలో కేవీకే క్షేత్రంలో ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా పవర్‌ వీడర్‌, కొమ్మలను కత్తిరించే పరికరం, గుళికలను వెదజల్లు పరికరం, మొక్కలను, నారును విత్తు పరికరం, పంటలను కోయు పరికరం వంటి వాటిని మహిళా రైతు ప్రయోజనార్థం చూపించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ఆత్మ ఉప సంచాలకులు పద్మావతి, కేవీకే శాస్త్రవేత్తలు డా. ప్రశాంతి, డా. శిల్పకళ, డా. మహేష్‌ బాబు, డా. సాయి మహేశ్వరీ, డా. మానస, డా. సురేష్‌ కుమార్‌ రెడ్డి, కేవీకే కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నూతన పాలసీల పోస్టర్లు ఆవిష్కరణ



నూతన పాలసీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎల్‌ఐసీ అధికారులు

కడప కల్చరల్‌ : దేశంలోని 18–45 సంవత్సరాల మధ్య వయస్సుగల వారి అవసరాలకు అనుగుణంగా ఎల్‌ఐసీ నాలుగు కొత్త పాలసీలను ప్రారంభించిందని కడప సీనియర్‌ డివిజనల్‌ మేనేజర్‌ జీకేఆర్‌వీ రవికుమార్‌ తెలిపారు. మంగళవారం స్థానిక సంస్థ డివిజనల్‌ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇతర అధికారులు, సిబ్బంది, సంఘ నాయకులతో కలిసి ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్‌ మాట్లాడుతూ యువ టర్మ్‌ పాలసీ, యువ డిజి టర్మ్‌ పాలసీ, యువ క్రెడిట్‌ లైఫ్‌ పాలసీ, యువ డీజీ క్రెడిట్‌ లైఫ్‌ పాలసీలను ప్రారంభిస్తున్నామన్నారు. డివిజన్‌లోని తొలిరోజే అన్ని శాఖలు, శాటిలైట్‌ కార్యాలయాల్లో మంచి స్పందన లభించిందన్నారు. ఈ పాలసీలను టర్మ్‌ పాలసీలుగా, క్రెడిట్‌ లైఫ్‌ (మార్టగేజ్‌) పాలసీలుగా అందిస్తున్నామన్నారు. తక్కువ ప్రీమియంతో 5 కోట్ల గరిష్ట బీమా మొత్తంతో ఆన్లైన్‌ , ఆఫ్‌ లైన్‌ పద్ధతిలో ఈ పాలసీలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రీమియం చెల్లింపు వ్యవధి 15 ఏళ్ల నుండి 40 సంవత్సరాల వరకు ఎంచుకోవచ్చని వివరించారు. గరిష్ట మెచ్యూరిటీ వయస్సు 75 ఏళ్లు మించరాదని సూచించారు. సింగిల్‌ ప్రీమియం, సంవత్సర, అర్ధ సంవత్సర కంతుల్లో ప్రీమియం చెల్లించవచ్చన్నారు. అనంతరం మార్కెటింగ్‌ మేనేజర్‌ శ్యామ్‌ సుందర్‌రావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సేల్స్‌ మేనేజర్‌ సాల్మన్‌ రాజు, ప్రొడక్ట్‌ మేనేజర్‌ రామకృష్ణ, ఇతర మేనేజర్లు సత్య ప్రసాద్‌, రాము నాయక్‌, సంఘాల ప్రతినిధులు చంద్రపాల్‌ , రఘునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్‌ పోస్టులలో అర్హులకు న్యాయం చేయాలి



డీఈఓ కార్యాలయ ఏడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఆర్‌సీఎం ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్‌: ఆర్‌సీఎం ఎయిడెడ్‌ పోస్టులలో అర్హులైన వారికి న్యాయం చేయాలని ఆర్‌సీఎం అన్‌ ఎయిడెడ్‌ ఉపాధ్యాయులు కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డిలకు వారు వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఆర్‌సీఎం స్కూల్లో అన్‌ ఎయిడెడ్‌ టీచర్‌గా పనిచేస్తున్నామన్నారు. మేము అన్ని రకాల అర్హతలు కలిగి ఉన్నామని, మాకు న్యాయం చేయాలని కోరారు. అర్హత లేని వారు మాకు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

చిరుద్యోగులపై ప్రతాపం ఆపండి

కడప కార్పొరేషన్‌: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుండే రాష్ట్రవ్యాప్తంగా చిరు ఉద్యోగులపై ప్రతాపం చూపిస్తూ వారిని ఉద్యోగాల నుంచి తొలగించడం దారుణమని వైఎస్సార్‌ టీయూసీ జోనల్‌ ఇన్‌చార్జి ఎన్‌. రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐకెపి, వివోఏ, మధ్యాహ్న భోజనపథకం, పారిశుద్ధ్య కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్‌ అసిస్టెంట్లు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, స్టోర్‌ డీలర్లపై సాగిస్తున్న దమనకాండను తక్షణం ఆపి, వారి ఉద్యోగాలకు భద్రతకల్పించాలని ఆయన డిమాండ్‌ చేశారు. ఆరోగ్యశ్రీ స్థానంలో ఆరోగ్య బీబీమాను తీసుకురావాలని చూస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 2600 మంది ఆరోగ్య మిత్రలను తొలగించేందుకు ప్రయత్నాలు ఆరంభించారన్నారు. వీరికి వైఎస్సార్‌టీయూసీ అండగా నిలబడి పోరాడుతుందని తెలిపారు. ఈ చర్యలను ప్రజాస్వామ్యవాదులందరూ ముక్తకంఠంతో ఖండించి ,వీరికి బాసటగా నిలబడాలని కోరారు.

పంట నమోదు తప్పనిసరి

పెండ్లిమర్రి : పంటలు సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు తప్పని సరిగా చేయించాలని వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. మంగళవారం మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామ పొలాల్లో సాగు చేసిన పత్తి పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ కృష్ణచైతన్య రైతులు పాల్గొన్నారు.

బస్టాండు జలమయం

కడప నగరంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఆర్టీసీ బస్టాండు ఆవరణం జలమయమైంది. సుమారు గంటకు పైగా కురిసిన వర్షం కారణంగా ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. – కడప కోటిరెడ్డిసర్కిల్‌



బీసీ జిల్లా అధికారికి శుభాకాంక్షలు



బీసీ జిల్లా అధికారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

కడప రూరల్‌ : బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఇటీవల బీసీ సంక్షేమశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన భరత్‌కుమార్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి మాట్లాడుతూ బీసీ భవన్‌ నిర్మాణం పూర్తయిందని, త్వరలో చేపట్టాల్సిన పనులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తివిక్రమ్‌ యాదవ్‌, ఎం.శ్రీనివాసులు, ఎస్‌.ఖాదర్‌బాష, సీఆర్‌ఐ సునీల్‌ జయంత్‌, కల్యాసుధాకర్‌, ఆర్ల గంగయ్య, మునిరత్నం గౌడ్‌, నరసింహారావు, మల్లికార్జున యాదవ్‌, పట్టుపోగుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో చురుగ్గా ఉండాలి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ శ్రావణి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ప్రజలకు అన్ని విధాల తోడ్పాటు అందిస్తున్న ఆశా కార్యకర్తలు విధి నిర్వహణలో చురుగ్గా వ్యవహరిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు పొందాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ శ్రావణి, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ నాగరత్నమ్మ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కడప నగరం బళ్లారిరోడ్డులోగల పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాతృ, శిశు మరణాలు సంభవించకుండా ఉండాలంటే కిల్కారి (చిన్నారి చిరునవ్వు) సేవల గురించి అవగాహన కల్పించాలన్నారు. కిల్కారి సేవలు అంటే గర్భవతి అయిన 12వ వారం నుండి ప్రసవం అయ్యేవరకు, అనంతరం ప్రసవం తరువాత బిడ్డకు ఒక సంవత్సరం వచ్చే వరకు సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో డెమో భారతి, పుల్లయ్య, సిహెచ్‌ఓ ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్‌ వాడకంతో ప్రమాదాలకు చెక్‌

కడప ఎడ్యుకేషన్‌: ద్విచక్ర వాహన దారులు హెల్మెట్‌ను వాడటం వలన ప్రమాదాలను నివారించవచ్చని సిద్ధార్థ ఇంగ్లీష్‌ మీడియం హైస్కూల్‌ కరస్పాండెంట్‌ లక్ష్మయ్య అన్నారు. మంగళవారం కడప మోచంపేట సిద్ధార్థ హైస్కూల్లో రాయల్‌ రషీద్‌ అసోసియేషన్‌ వారు ముద్రించిన హెల్మెట్‌ ధరించండి అనే కరపత్రాలను కరస్పాండెంట్‌ లక్ష్మయ్య చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ సంస్థ అధినేత అబ్దుల్‌ షేక్‌ రాయల్‌ కరీముల్లా పాల్గొన్నారు.

అర్హులకు పదోన్నతులు కల్పించాలి



ఆర్డీ డాక్టర్‌ శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎన్జీఓ నేతలు

కడప రూరల్‌ : అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసులు, బి.రవికుమార్‌ కోరారు. వైద్య ఆరోగ్యశాఖ రీజినల్‌ డైరెక్టర్‌గా డాక్టర్‌ శ్రీనివాసులు ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం స్థానిక కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జోన్‌–4 పరిధిలో అన్ని క్యాడర్లకు సంబంధించిన అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీను, బాల పుల్లయ్య, కడప అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్‌రెడ్డి, పద్మనాభం, జ్యోతి, గౌరి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ వీసీని కలిసిన పిచ్చయ్య చౌదరి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం వైస్‌ చాన్సలర్‌ ఆచార్య కె. కృష్ణారెడ్డిని ఉమ్మడి ఏపీ ఇంటర్మీడియట్‌ విద్యా మండలి విశ్రాంత సంయుక్త కార్యదర్శి అలపర్తి పిచ్చయ్య చౌదరి మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తన రచన అయిన పర్యాటకం పుస్తకాన్ని వీసీకి అందజేశారు. ఈ సందర్భంగా తన రచనల గురించి వివరించారు. విశ్వవిద్యాలయాభివృద్ధి, విద్యార్థులకు ప్రయోజనకరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

వీసీని కలిసిన నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్‌

వైవీయూ పూర్వ విద్యార్థి ఆదికవి నన్నయ యూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్‌ బి.జగన్మోహన్‌ రెడ్డి వైస్‌ చాన్సలర్‌ ఆచార్య కృష్ణారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 1994–96 విద్యా సంవత్సరంలో కడప పీజీ సెంటర్లో కెమిస్ట్రీ చదివానని వివరించారు. చదివిన చోటుకే ఎగ్జామినర్‌ గా రావడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన ఆచార్యులు పి. పద్మ, ఐటీ సెల్‌ సంచాలకులు తుమ్మలకుంట శివ ప్రతాప్‌, కెమిస్ట్రీ ఆచార్యులు ఎస్‌.సి. గంగిరెడ్డి, , డాక్టర్‌ ఎస్వీ కృష్ణారావు, డాక్టర్‌ వెంకటేశ్వర్లు, డాక్టర్‌ వెంకట్రామ్‌ పాల్గొన్నారు.

వైవీయూలో న్యాయకళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాయలసీమ విద్యార్థి సమాఖ్య నాయకులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో న్యాయవిద్య కళాశాలను ఏర్పాటు చేయాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య (ఆర్‌వీఎస్‌) నాయకులు కోరారు. మంగళవారం వైవీయూలో ఆర్‌వీఎస్‌ రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్‌ మాట్లాడుతూ జిల్లా నుంచి పెద్దసంఖ్యలో న్యాయవిద్యను అభ్యసిస్తున్నారన్నారు. జిల్లాలో కేవలం ప్రైవేట్‌ కళాశాలలు మాత్రమే ఉన్నాయని, విశ్వవిద్యాలయంలో న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాశాఖ మంత్రి స్పందించి వైవీయూలో న్యాయకళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్‌ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.